## కట్ ఆఫ్ తేదీల్లో మినహాయింపులు ఇవ్వాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి నగర మేయర్ వినతి

కార్పొరేషన్, ఆగస్టు 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన టీఎస్‌బీపాస్‌లోని కట్ ఆఫ్ తేదీల్లో మినహాయింపులు ఇవ్వాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు శుక్రవారం రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో ఎనిమిది గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయని, వీటిల్లో బీపాస్‌లో ఇచ్చిన 2020 ఆగస్టులోగా ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయి ఉండాలన్న నిబంధనల వల్ల భవన నిర్మాణ అనుమతులు తీసుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. విలీన గ్రామాలతో పాటు కార్పొరేషన్ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల మంజూరు కోసం రిజిస్టర్ డాక్యుమెంట్ల కట్ ఆఫ్ తేదీకి సంబంధించి టీఎస్‌బీపాస్ చట్టంలో నిర్దేశించిన షరతులను సడలించి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీని వల్ల ఆయా విలీన గ్రామ పంచాయతీల పరిధిలో భవన నిర్మాణ అనుమతులు పొందేలా ప్రోత్సహించినట్లవుతుందని, తద్వారా అనధికార నిర్మాణాలను కూడా తగ్గించవచ్చని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### బీసీ హాస్టల్‌లో ట్రైనీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

చిగురుమామిడి/ గన్నేరువరం, ఆగస్టు 2 : చిగురుమామిడి మండల కేంద్రంలోని ఎస్సీ సమీకృత బాలుర వసతి గృహం, కస్తూర్బా స్కూల్‌ను ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో టాయిలెట్స్, స్నానపు గదులు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, హాస్టల్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా కస్తూర్బా స్కూల్‌తో పాటు హాస్టల్‌ను విజిట్ చేసి సమస్యలు తెలుసుకొని విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ముద్దసాని రమేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఖాజా మొహీనుద్దీన్, ఎంపీవో శ్రవణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ సంపత్, ఆర్ఐ అరుణ్ కుమార్, హాస్టల్ వార్డెన్ మహేందర్ రెడ్డి తదితరులున్నారు. అలాగే గన్నేరువరం మండల కేంద్రంలోని ఎస్సీ బాలల సంక్షేమ వసతి గృహాన్ని సైతం తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్, ఈ సందర్భంగా హాస్టల్‌లోని వసతులపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వంటగదులు, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ గోవర్ధన్, సిబ్బంది ఉన్నారు.

### మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

తిమ్మాపూర్/ వీణవంక/ చిగురుమామిడి/ కరీంనగర్ రూరల్/ మానకొండూర్, ఆగస్టు 2: అసెంబ్లీ ముట్టడికి యత్నించిన జిల్లాలోని పలువురు మాజీ సర్పంచులను పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ, గ్రామాల్లో పని పనులు చేసిన వాటికి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాద్ బయలుదేరిన వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ప్రముఖ ఫైనాన్షియర్‌పై సీపీకి ఫిర్యాదు

హుజూరాబాద్, ఆగస్టు 2: పట్టణానికి చెందిన ప్రముఖ ఫైనాన్షియర్‌పై ఓ రాజకీయ నాయకుడు సీపీకి ఫిర్యాదు చేశారు. నాలుగేండ్ల క్రితం తన వ్యవసాయభూమిని ఫైనాన్షియర్‌కు మార్టిగేజ్ చేసి రూ.కోటి అప్పుగా తీసుకొని మిత్తితో పాటు అసలు చెల్లించానని, అయినప్పటికీ మరో రూ.40 లక్షలు చెల్లిస్తేనే భూ కాగితాలు ఇస్తానంటున్నాడని సదరు నాయకుడు సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో హుజూరాబాద్‌లోని అక్రమ ఫైనాన్స్‌లపై పోలీసులు దాడులు జరిపి చర్యలు తీసుకోగా, ఇప్పుడు రాజకీయ నాయకుడి ఫిర్యాదుతో పోలీసులు మరోసారి స్థానిక ఫైనాన్షియర్లపై ప్రత్యేక నిఘా వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు వినికిడి. ఈ క్రమంలో హుజూరాబాద్‌లోని వడ్డీ వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. అయితే సదరు నాయకుడు, ఫైనాన్షియర్ ఇద్దరూ కలిసి గతంలో కాంట్రాక్టు పనులు సైతం చేశారు. ఇదిలా ఉంటే ఆ ప్రముఖ ఫైనాన్షియర్ వద్ద మరో రాజకీయ నాయకుడు కూడా పెద్ద మొత్తంలో అప్పు తీసుకున్నట్లు పట్టణంలో చర్చ జరుగుతున్నది. పోలీస్ శాఖ సదరు ఫైనాన్షియర్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని అన్ని వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

# మూడో శనివారం 'స్వచ్ఛదనం-పచ్చదనం'

- స్పష్టమైన ప్రణాళికతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్ ఆడిటోరియంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఆగస్టు 2 : జిల్లాలో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈనెల ప్రారంభోత్సవం సందర్భంగా 5వ తేదీ నుంచి 9వరకు జిల్లాలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలపై కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా అధికార యంత్రాంగానికి ఆమె దిశానిర్దేశం చేశారు. గతంలో చేపట్టిన కార్యక్రమాల మాదిరిగానే దీనిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మండలం, గ్రామపంచాయతీల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్పష్టమైన ప్రణాళికతో గ్రామాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ ఉద్దేశం తెలిపేలా ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలపై పెయింటింగ్ చేయించాలన్నారు. శనివారం పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులందించాలని తెలిపారు. నివేశన స్థలాల్లో ఎక్కడా కూడా నీరు నిల్వ లేకుండా చూడాలని, తడి,పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలిస్తూ, ప్రతి ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో విధిగా వర్షపు నీటిని భూమిలోకి పంపేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ, వీధి కుక్కులు, ఇతర జంతువుల బెడద అధికంగా ఉండే చోట ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లు నెలకొల్పాలని సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌డీవో శ్రీధర్, ఆర్డీవో కె.మహేశ్వర్, సీపీవో కొమురయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో శ్రీనివాస్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం

తిమ్మాపూర్, ఆగస్టు 2: అంగన్‌వాడీల్లో చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందుతున్నదని, పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో గల రెండు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన శుక్రవారం సభ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులను అంగన్‌వాడీలకు పంపిస్తే పౌష్టికాహారం అందడంతో పాటు మేధస్సు పెరుగుతుందన్నారు. అలాగే గర్భిణులు, మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లి పాలప్రాధాన్యం తెలిపే గోడప్రతులను ఆవిష్కరించారు. అంగన్‌వాడీ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్, మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రణవ్, డాక్టర్ జువేరియా, డీసీపీవో శాంత, సంపత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, రోమిల, ప్రణీత, అంగన్‌వాడీ టీచర్లు ఫరీదా, సునీత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

శంకరపట్నం: లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కవిత

కలెక్టరేట్/ చిగురుమామిడి/ గన్నేరువరం/ మానకొండూర్ రూరల్/ సైదాపూర్/ శంకరపట్నం, ఆగస్టు 2: తల్లిపాలపై మహిళలు, గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెంచేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తల్లిపాల వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ, పుట్టిన ప్రతి బిడ్డకూ తల్లిపాలు పట్టించేలా ప్రేరేపిస్తున్నారు. గన్నేరువరం మండలం జంగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఇస్రత్ సుల్తానా హాజరై మాట్లాడుతూ, పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు ఇవ్వాలని, తల్లి పాలల్లో అన్ని రకాల పోషకాలు ఉంటాయని తెలిపారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి డీఆర్డీవో ఏపీడీ సునీత హాజరయ్యారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. సాధారణ ప్రసవం కోసం గర్భిణులు తగిన వ్యాయామం చేయాలని మండల వైద్యాధికారి సన్నిళ్ల రాజేశ్ సూచించారు. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాలకు ఐసీడీఎస్ కొత్తగట్టు సెక్టార్ సూపర్‌వైజర్ కవిత హాజరై తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ మనో చిత్ర, అంగన్‌వాడీ టీచర్లు సరోజన, సరిత, తల్లులు, ఆయాలు పాల్గొన్నారు. మానకొండూర్ మండలం కేలేడు గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. సైదాపూర్ మండలం ఆకునూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజిత, ఏఎన్ఎం శారద తదితరులు పాల్గొన్నారు. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాలకు మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ హాజరై, తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ షేక్ మస్రత బేగం, ఏఎన్ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, ఆయా గౌరమ్మ, ఆశ కార్యకర్త అంజలి పాల్గొన్నారు.

### ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అధికారులు

జమ్మికుంట, ఆగస్టు 2: జమ్మికుంట మండల తహసీల్దార్‌గా రమేశ్‌బాబు, వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా మల్లేశ్ ఇటీవల నియామకం కాగా, శుక్రవారం అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ విజయ మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. తహసీల్దార్ రమేశ్‌బాబు గంగాధర నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పని చేసిన రెడ్డినాయక్ వరంగల్ జిల్లా నర్సంపేటకు బదిలీ కాగా, హుజూర్‌నగర్ కార్యదర్శి జమ్మికుంటకు బదిలీపై వచ్చారు.

### పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

హుజూరాబాద్, ఆగస్టు 2: పట్టణంలోని 5. 6వ వార్డుల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతన్నారు. పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ అపరాజ ముత్యంరాజు, హెల్త్ ఆఫీసర్ జరినా, అధికారులు పాల్గొన్నారు.

### సుప్రీం కోర్టు తీర్పుపై దళితుల సంబురాలు

కార్పొరేషన్/చొప్పదండి/ రామడుగు/ సైదాపూర్/గంగాధర/ శంకరపట్నం, ఆగస్టు 2: సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడాన్ని స్వాగతిస్తూ శుక్రవారం దళితులు జిల్లా వ్యాప్తంగా సంబురాలు జరుపుకొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నగరంలో కార్ఖానాగడ్డలోని గాంధీచౌక్ వద్ద, రామడుగు, గంగాధర మండలం బూరుగుపల్లి, సైదాపూర్ మండలం బొమ్మకల్, చొప్పదండి పట్టణంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంచారు. పటాకులు కాల్చారు. అలాగే శంకరపట్నం మండలం తాడికల్‌లో గ్రామ అంబేద్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### కాంగ్రెస్ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో..

మానకొండూర్, ఆగస్టు 2: ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలుపడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, జిల్లా కార్యదర్శి తాళ్లపెల్లి సంపత్‌గౌడ్, ఎస్సీసెల్ నాయకులు గసిగంటి సంపత్, కోండ్ర సురేశ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

### సబ్ రిజిస్ట్రార్‌గా అబ్జల్‌నూర్ ఖాన్

గంగాధర, ఆగస్టు 2 : గంగాధర సబ్ రిజిస్ట్రార్‌గా అబ్జల్‌నూర్ ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సబ్ రిజిస్ట్రార్ పద్మ హైదరాబాద్ కమిషనర్ అండ్ ఐజీ కార్యాలయానికి బదిలీ కాగా, ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన అబ్జల్‌నూర్ ఖాన్ గంగాధరకు బదిలీపై వచ్చారు. కాగా, సబ్ రిజిస్ట్రార్‌కు కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి, సాదర స్వాగతం పలికారు.

### 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 2: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి మానకొండూర్ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామానికి చెందిన మానుపర్తి జయశంకర్ (32) మినీ అశోక్ లేలాండ్ వాహనం (టీఎస్ 02 యూడీ 0249)లో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వరంగల్ వైపు నుంచి కరీంనగర్ తరలిస్తున్నాడు. ఈ క్రమంలో మానకొండూర్ చెరువుకట్ట వద్ద పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుపడ్డాడు. బియ్యం లోడ్‌తో ఉన్న వాహనాన్ని స్టేషన్‌కు తరలించి జయశంకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

శంకరపట్నం, ఆగస్టు 2: కేశవపట్నం గ్రామానికి చెందిన మేకల కొమురయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ, హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతుండగా, కుటుంబం ఆర్థిక స్థితిగతులు తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి చికిత్స కోసం రూ.1.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి గొడిశాల ప్రవీణ్, తదితరులకు కొమురయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### రేపు కరీంనగర్‌లో జాతీయ కరాటే పోటీలు

కొత్తపల్లి, ఆగస్టు 2 : జిల్లా కేంద్రంలోని రాజశ్రీ గార్డెన్స్‌లో జీఆర్ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 4న గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ జాతీయ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గౌరు రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 900 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. కటా, కుమిటి, టీం కటాస్, వెపన్ కటా విభాగాల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు పోటీలు జరుగుతాయన్నారు. కుమిటి విభాగంలో గ్రాండ్ చాంపీయన్‌షిప్‌కు పోటీలు నిర్వహించి చాంపియన్‌షిప్ సాధించిన వారికి నగదు పారితోషికం అందజేయనున్నట్లు తెలిపారు.

### విశ్వ విద్యాలయం పేరు మార్పుపై నిరసన చేపట్టాలి

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 2: ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పేరు మార్చడాన్ని ఖండిస్తూ ఆర్య వైశ్యులందరూ ఏకమై మండలాలు, జిల్లాల వారీగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ డైరెక్టర్, వైశ్య సేవా కేంద్రం డైరెక్టర్ తాటిపల్లి సుభాష్ పిలుపునిచ్చారు. వైశ్య కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వడంతో పాటు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలని శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

### విభజన హామీలను అమలు చేయాలి: చాడ

తెలంగాణచౌక్, ఆగస్టు 2: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారం కోసం మద్దతు ఇచ్చిన పార్టీల పాలిత రాష్ట్రాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చి మిగతా రాష్ట్రాలకు నిధులు కేటాయించకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలనే డిమాండ్‌తో త్వరలో ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశాల్లో భవిష్యత్ ప్రణాళికలను రూపొందించి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సరేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, కార్యాలయ కార్యదర్శి సదాశివ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

చిగురుమామిడి, ఆగస్టు 2: మండలంలోని ఇందుర్తి గ్రామంలో అనుగొని పరశురాములు గౌడ్, భీమర హిమాన్సు, గునుకులపల్లిలోని అరకాల పల్లెలో హనుమాన్ల వజ్రమ్మ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతిచెందగా, శుక్రవారం వారి కుటుంబాలను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, మాజీ జడ్పీటీసీ అందే స్వామి, సీనియర్ నాయకులు తేరాల సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య, నాయకులు అందే చిన్నస్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, ఉస్మాన్, బింగి స్వామి, ఉత్తమ చారి, పుల్లయ్య, సంపత్ తదితరులున్నారు.

### ఇల్లాలి ఆరోగ్యమే ఇంటిల్లిపాదికి శ్రీరామరక్ష

కలెక్టరేట్/ కరీంనగర్ రూరల్/ శంకరపట్నం/చొప్పదండి, ఆగస్టు 2 : ఇల్లాలు ఆరోగ్యం ఇంటిల్లి పాదికి శ్రీరామరక్ష అని అంగన్‌వాడీ అర్బన్ సీడీపీవో జి.ఉమారాణి పేర్కొన్నారు. శుక్రవారం సభలో భాగంగా నగరంలోని సవరన్ స్ట్రీట్ సెక్టార్‌లో గల కార్ఖానాగడ్డ మూడో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాల్సిన అవసరముందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.జువేరియా మాట్లాడుతూ, మహిళల్లో ఆరోగ్య సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, వైద్యురాలు కె.శోభ, శ్రీవాణి, అనిత, రాజమణి, పోషణ్ అభియాన్ పర్యవేక్షకుడు సతీశ్, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు, తల్లులు, ఆశ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

### తల్లిపాలతోనే రోగనిరోధక శక్తి పెరుగుదల

నవజాత శిశువులకు అందించే తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ తెలిపారు. నగరంలోని పద్మనగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, ప్రతి శిశువుకు ముర్రుపాలు తప్పక పట్టించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్ ఎ.సరిత, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కృష్ణవేణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, ఆగస్టు 2: మండలంలోని చామనపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ-1 సెంటర్‌లో శుక్రవారం సభకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ నిర్మల హాజరై తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి, చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోహర్, సూపర్‌వైజర్ నిర్మల, వీవోఏలు, ఏఎన్ఎం వెంకట రాజమ్మ, స్వరూప, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

గంగాధర, ఆగస్టు 2: పవర్‌లూమ్స్ వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం వస్త్రోత్పత్తి ఆర్డర్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గర్శకుర్తి గ్రామ పవర్ లూమ్స్ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా కార్మికులు కళ్లకు గంతలకు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు.

### దవాఖానలో ఆకస్మిక తనిఖీ

ఐసీయూ వార్డును తనిఖీ చేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి

విద్యానగర్, ఆగస్టు 2: సీజనల్ వ్యాధుల కారణంగా కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానకు రోగుల సంఖ్య పెరుగడంతో సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి శుక్రవారం దవాఖానలోని పలు వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోగులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచనలు చేశారు.

### బాధిత కుటుంబాలకు జీవీఆర్ పరామర్శ

మానకొండూర్ రూరల్, ఆగస్టు 2: మానకొండూర్ మండలం పెద్దూర్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు గంగినేని మల్లేశ్ తల్లి మల్లమ్మ, శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన బొజ్జ లింగయ్య, మానకొండూర్ గ్రామానికి చెందిన గొల్ల రాజయ్య కుమారుడు గొల్ల సంతోష్ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందారు. వీరి కుటుంబాలను శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మానకొండూర్ మండలాధ్యక్షుడు మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

### ఐటీఐల్లో దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 2 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఎన్‌సీవీటీ ప్యాట్రన్‌లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం మూడో విడుతల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందు కోసం ఆన్‌లైన్‌లో వెబ్‌అప్షన్లు ఈ నెల 12వ తేదీలోగా ఇచ్చుకోవాలని సూచించారు.

### డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 2 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ